TGTEL/25/A0871

# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :32 | 15-08- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల:03/-

# విద్యార్థులే భావి భారత నిర్మాతలు



న్యూఢిల్లీ, ఆగస్టు 14: విద్యార్థులే భారత దేశ భవిష్యత్తును నిర్మించే శిల్పులని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆమె దేశ ప్రగతి, యువత, విద్య, మహిళా సాధికారత, జాతీయ భద్రత, సాంకేతిక అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశ భవిష్యత్తును మరింత బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు, ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు సంస్కరణలు చేపడుతున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. పరీక్షల వ్యవస్థ మరింత విశ్వసనీయంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల వర్తమానంతో పాటు వారి భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, సమాజంపై ఉందన్నారు

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం సాధించిన ప్రగతిని రాష్ట్రపతి ప్రస్తావించారు. భారతదేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, దేశాన్ని మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

జాతీయ భద్రత విషయంలో దేశం ఎలాంటి రాజీ పడబోదని రాష్ట్రపతి స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వం, భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాద చర్యలను ఎదుర్కొనే విషయంలో ప్రభుత్వం, భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళల సాధికారత, యువతకు అవకాశాలు, విద్య, వ్యవసాయం, సాంకేతిక రంగాల అభివృద్ధి వంటి అంశాలపై కూడా రాష్ట్రపతి తన సందేశంలో ప్రస్తావించారు. ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు అందేలా సమ్మిళిత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

# రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు

## రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు.. 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రులు తెలిపారు.

గతంలో రాష్ట్రంలో సుమారు 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసి మరో 62 లక్షల మందికి ప్రయోజనం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అర్హులైన పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా రేషన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు స్మార్ట్ కార్డుల జారీకి చర్యలు చేపట్టినట్లు తెలిపింది.

**డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ సదస్సు**

గత ఏడాది నిర్వహించిన తరహాలోనే ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సును నిర్వహించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రధాన అంశంగా సదస్సును నిర్వహించనున్నారు. భవిష్యత్ నగర ప్రణాళికను ఆవిష్కరించడంతో పాటు రక్షణ, అంతరిక్ష, ఔషధ పరిశ్రమలు తదితర రంగాల్లో తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి వివరించేలా సదస్సును నిర్వహించాలని నిర్ణయించారు.

**ధాన్యం మిగులు నిల్వల విక్రయానికి నిర్ణయం**

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రివర్గం పేర్కొంది. ఈసారి రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 63.62 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించనున్న నేపథ్యంలో మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. క్వింటాలుకు రూ.2,389 కనీస ధరను నిర్ణయించి విక్రయ ప్రక్రియ చేపట్టనున్నారు.

**ఐటీఐలు, పాలిటెక్నిక్‌లకు కొత్త పరిధి**

రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు, అధునాతన సాంకేతిక కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నైపుణ్య ఆధారిత విద్యను మరింత బలోపేతం చేసి పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**నిర్మల్ సహా ఏడు నియోజకవర్గాల్లో పాఠశాలలు**

నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రాష్ట్రంలోని 113 నియోజకవర్గాల్లో పాఠశాల సముదాయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే 86 పాఠశాల సముదాయాలకు అనుమతులు మంజూరయ్యాయి.

**ఆటో డ్రైవర్లకు రూ.1.50 లక్షల సబ్సిడీ**

హైదరాబాద్‌ను కాలుష్యరహిత, హరిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న సుమారు 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు.

ప్రస్తుత ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవడంతో పాటు పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నారు. దీనివల్ల ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు నగరంలో వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**పరిశ్రమల తరలింపునకు గడువు పొడిగింపు**

హైదరాబాద్ నగర పరిధిలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హెచ్ఐఎల్‌టీ విధానంలో దరఖాస్తు గడువును మరో మూడు నెలలు పొడిగించింది. పరిశ్రమల యాజమాన్యాల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

సాగునీటి ప్రాజెక్టులకు భారీ

2

# విద్యార్థులకు ముందుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్

## ప్రతి ఏటా రూ.2,400 కోట్లు ఖాతాల్లో జమ చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 14: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఇకపై ప్రతి ఏటా ముందుగానే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ప్రత్యేకంగా ప్రభుత్వాన్ని కోరాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగానే నిధులు అందేలా పథకాన్ని ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. నెక్లెస్ రోడ్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను సీఎం ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపివేయడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులు అడగకుండానే వారి ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేసేలా ఈ విద్యా సంవత్సరం నుంచే ముందస్తు విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా సుమారు రూ.2,400 కోట్లు విద్యార్థుల ఖాతాల్లో జమ చేసేలా పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఒకప్పుడు ఇంజినీరింగ్, వైద్య విద్యకు సంబంధించిన పట్టా ఉంటే ఉద్యోగాలు లభించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని చెప్పారు. నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యతో పాటు ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్య విశ్వవిద్యాలయం వంటి అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా నర్సింగ్ విద్యను అభ్యసించిన వారికి జపాన్, ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుతం విద్యా రంగంలో పోటీ పెరిగిందని, అనేక మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారని సీఎం పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ప్రతి విద్యార్థిలోనూ ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

క్రీడల్లో రాణించే యువతకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందించే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మరోవైపు కృత్రిమ మేధస్సు విస్తరణతో ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోందని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో కంప్యూటర్ సైన్స్ చదివిన వారికి విదేశాల్లో విస్తృత అవకాశాలు ఉండేవని, ఇప్పుడు సాంకేతిక విప్లవం కారణంగా అనేక రంగాల్లో ఉద్యోగాల స్వరూపం మారుతోందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు ప్రభావంతో ఇంజినీరింగ్, పట్టభద్రులు, సమాచార సాంకేతిక రంగ నిపుణుల ఉద్యోగాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని, ఈ మార్పులను ఎదుర్కొనేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కులాల మధ్య అంతరాలను తగ్గించేందుకు అన్ని వర్గాల విద్యార్థులు కలిసి చదువుకునేలా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల విధానం ద్వారా మార్పులు తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. సామాజిక సమానత్వం, విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఏర్పాటు కేవలం జయంతి, వర్ధంతుల నిర్వహణ కోసం కాదని సీఎం పేర్కొన్నారు. వారి జీవితాలు, త్యాగాలు, సామాజిక సంస్కరణల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యమన్నారు. మహనీయుల స్ఫూర్తితో విద్యలో రాణించడంతో పాటు సామాజిక చైతన్యంతో సమాజ అభివృద్ధికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజహరుద్దీన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో రాహుల్‌కు బిగ్ రిలీఫ్: వీర్ సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత, లక్నో కోర్టు సమన్లు రద్దు



న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, వర్తమాన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఊహించని రీతిలో భారీ ఊరట లభించింది. స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్‌పై వివాదాస్పద మరియు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న తీవ్రమైన ఆరోపణలతో ఆయనపై నమోదైన క్రిమినల్ పరువు నష్టం కేసును సుప్రీంకోర్టు సంపూర్ణంగా కొట్టివేసింది. దీనికి తోడు ఈ కేసుకు సంబంధించి లక్నో దిగువ కోర్టు గతంలో

2

# హక్కుల దాహం... విధుల్లో ద్రోహం!

# 80 ఏళ్ల స్వతంత్ర భారతాన పౌర బాధ్యత ఎక్కడ?

భారతదేశం తన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఆడంబరంగా, కన్నులపండువగా జరుపుకుంటున్న ఈ చారిత్రక ఘట్టంలో, మన ప్రజాస్వామ్య మూలాలను, పౌర వ్యవస్థను ఒక్కసారి నిలదీసి ప్రశ్నించుకోవాల్సిన తీవ్రమైన ఆవశ్యకత ఏర్పడింది. స్వతంత్ర దేశంగా ఎనభై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించుకుని, ఒక కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్న ఈ వర్తమాన క్షణం కేవలం జెండా వందనాలు, రంగురంగుల వేడుకలు, నాయకుల వేదిక ఉపన్యాసాలకే పరిమితం కాకూడదు. విదేశీ పాలన, అణచివేత నుంచి విముక్తి పొంది ఎన్నో దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ, నేటికీ మనం కులం, మతం, ప్రాంతం, భాష అనే కుంచిత భావజాలాల్లోనే కొట్టుమిట్టాడుతూ ఉండటం అత్యంత విచారకరం. నాటి బ్రిటీష్ పాలకుడు విన్స్టన్ చర్చిల్ భారతదేశాన్ని ఉద్దేశించి "భారతదేశం అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే తప్ప, అదొక ఐక్యమైన దేశం ఎంతమాత్రమూ కాదు" అని తీవ్రమైన హేళన చేశాడు. నేటికీ సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న విభజన రాజకీయాలను, సంకుచిత స్వార్థ ప్రయోజనాలను చూస్తుంటే... మన స్వయంకృత అపరాధాలతో ఆనాడు ఆయన చేసిన వ్యాఖ్యలను నిజం చేయడానికి ప్రయత్నిస్తున్నామా అనే ఆత్మపరిశీలన ప్రతి పౌరుడిలోనూ కలగాలి.

ఏదైనా ఒక చైతన్యవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా సాగాలన్నా, అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలన్నా అది ప్రాథమిక హక్కులు,ప్రాథమిక విధులు అనే రెండు బలమైన చక్రాల మీద మాత్రమే పయనించాలి. భారత రాజ్యాంగంలోని మూడవ భాగం పౌరులకు భావప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, సమానత్వం, స్వేచ్ఛగా జీవించే హక్కు వంటి అపారమైన ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. నేడు రాజధాని ఢిల్లీ నుంచి రాంచీ వీధుల వరకు తమ కోరికల కోసం పోరాడుతున్న విద్యార్థులైనా, లేదా సరిహద్దుల వద్ద సుదీర్ఘ కాలంగా ఆందోళన చేస్తున్న రైతులైనా... తమకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల గురించి ఎంతో చైతన్యంతో గళమెత్తుతున్నారు.



పౌరులు తమ హక్కుల పట్ల ఈ స్థాయిలో అవగాహనతో ఉండటం ఖచ్చితంగా ఆహ్వానించదగిన పరిణామమే. అయితే, హక్కుల కోసం వీధిపోరాటాలు చేసే మన పౌర సమాజం, అదే రాజ్యాంగం తమకు స్పష్టంగా నిర్దేశించిన ప్రాథమిక విధులను పాటించే విషయంలో మాత్రం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శిస్తోంది.

మన రాజ్యాంగాన్ని తొలినాళ్లలో రూపుదిద్దుకున్నప్పుడు అందులో ప్రాథమిక విధులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఏవీ లేవు. సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటం నుంచి లభించిన మహోన్నతమైన స్ఫూర్తితో పౌరులు తమ దేశం పట్ల, తోటి సమాజం పట్ల స్వీయ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. కానీ కాలక్రమేణా మారుతున్న సమాజంలో పౌరులలో జాతీయ భావం, పౌర బాధ్యతలు లోపించడాన్ని గుర్తించిన ప్రభుత్వం, 1976లో స్వరన్ సింగ్ సమితిని నియమించింది. ఆ సమితి ఇచ్చిన కీలక సిఫార్సుల ఆధారంగా 42వ రాజ్యాంగ సవరణను తీసుకువచ్చి, రాజ్యాంగంలో నాలుగోవ-ఎ భాగం కింద 10 ప్రాథమిక విధులను చేర్చక తప్పలేదు. ఆ తర్వాత 2002లో చేసిన 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక బాధ్యతను జతచేసి, మొత్తం 11 ప్రాథమిక విధులను మన రాజ్యాంగంలో శాశ్వతంగా నిక్షిప్తం చేశారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, నేటి సమాజంలో 19వ ప్రకరణ మనకు ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛ గురించి సుదీర్ఘంగా మాట్లాడేవారికి, 51-ఎ ప్రకరణలో ఉన్న పౌర విధులు మాత్రం గుర్తుకు రాకపోవడమే. మన దేశంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడటం, ప్రజలందరి మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, ప్రభుత్వ ఆస్తులను మన స్వంత ఆస్తులుగా భావించి రక్షించుకోవడం, సమాజంలో హింసాత్మక ధోరణులను పూర్తిగా వీడటం వంటివి రాజ్యాంగం పౌరులకు విధించిన ప్రాథమిక బాధ్యతలు. కానీ నేడు మన దేశంలో జరుగుతున్నదేమిటి? ఏ చిన్న సమస్య వచ్చినా నిరసనల నెపంతో రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ వాహనాలు, రైళ్లు తగలబెట్టడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, సామాజిక మాధ్యమాల వేదికగా ద్వేషపూరితమైన వ్యాఖ్యలతో సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టడం నిత్యకృత్యంగా మారింది. హక్కులను అనుభవించడానికి అమితమైన ఉత్సాహంతో పరిగెత్తుకుంటూ వచ్చే పౌరులు, తమ విధులను నెరవేర్చాల్సిన సమయం వచ్చేసరికి మాత్రం పూర్తిగా ముఖం చాటేస్తున్నారు.

ప్రాథమిక హక్కులు అనేవి పౌరులకు ప్రభుత్వాల అణచివేత విధానాలు, నిరంకుశత్వం నుంచి ఒక బలమైన రక్షణ కవచంగా నిలుస్తాయి. అదే సమయంలో, ప్రాథమిక విధులు పౌరుడికి తన దేశం పట్ల, సమాజం పట్ల ఉండాల్సిన నైతిక స్పృతిని నిరంతరం గుర్తుచేస్తూ నడిపిస్తాయి. కేవలం హక్కులు మాత్రమే ఉండి విధులు లేని సమాజం తీవ్రమైన ఉన్మాదానికి, శాంతిభద్రతల క్షీణతకు, అరాచకత్వానికి దారితీస్తుంది. అలాగే కేవలం విధులు మాత్రమే ఉండి హక్కులు లేని సమాజం పౌరులను బానిసలుగా మార్చి నియంతృత్వానికి బాటలు వేస్తుంది. కాబట్టి ఈ రెండింటి మధ్య సరైన సమతుల్యత సాధించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం లభిస్తుంది.

ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ మనమందరం ఒక దృఢమైన నిశ్చయానికి రావలసిన అవసరం ఉంది. మన హక్కులను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామో, రాజ్యాంగం మనకు నిర్దేశించిన బాధ్యతలను నెరవేర్చడానికి కూడా అంతే కట్టుబడి ఉండాలి. "దేశం మనకేం చేసింది అని ప్రశ్నించడం కాదు, ఈ దేశం కోసం నువ్వేం చేశావో ఆత్మపరిశీలన చేసుకో" అన్న ప్రసిద్ధ మాటలను కేవలం గోడలపై రాసే ఆకర్షణీయమైన నినాదాలుగా పరిమితం చేయకుండా, మన అనునిత్య జీవితంలో ఆచరించాల్సిన సూత్రాలుగా మార్చుకోవాలి. పౌరులందరిలోనూ తమ ప్రాథమిక విధుల పట్ల స్పృహ, గౌరవం పెరిగినప్పుడే మన భారత దేశానికి విముక్తి, నిజమైన స్వాతంత్ర్యం, సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతాయి.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# మాటే మనిషికి అసలైన ఆభరణం!

## మాట నిలబెట్టుకోవడం కూడా ఒక ధర్మమే.. మారుతున్న సమాజానికి మన పూర్వీకుల గొప్ప సందేశం

మనిషి సంపాదించే ఆస్తి, సంపద, హోదా, పేరు ఇవన్నీ కాలంతో మారిపోవచ్చు. కానీ ఒకసారి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న వ్యక్తిపై ఏర్పడే నమ్మకం మాత్రం తరతరాలకు నిలిచిపోతుంది. అందుకే భారతీయ ధార్మిక సంప్రదాయంలో "మాట"కు అత్యంత విలువ ఇచ్చారు. మాట అనేది కేవలం నోటితో పలికే శబ్దం కాదు.. అది మన వ్యక్తిత్వానికి ప్రతిబింబం. మనిషి నిజాయితీ, నిబద్ధత, విశ్వసనీయత అతని మాటల్లోనే బయటపడతాయి.

రామాయణాన్ని పరిశీలిస్తే శ్రీరాముడి జీవితంలో "మాట"కు ఉన్న ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది. తండ్రి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టేందుకు రాజ్యాన్ని వదిలి వనవాసానికి వెళ్లడం ఒక కుటుంబ కథ మాత్రమే కాదు.. ఇచ్చిన మాట కోసం వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేయగల ధర్మనిబద్ధతకు ప్రతీక. అందుకే శ్రీరాముడిని భారతీయ సమాజం కేవలం దేవుడిగా మాత్రమే కాకుండా ధర్మానికి ప్రతీకగా భావించింది.

ఇలాంటి విలువలు నేటి జీవితంలో ఎంతవరకు కనిపిస్తున్నాయి అనేది మనం ఆలోచించాల్సిన విషయం.

నేటి సమాజంలో మాట ఇవ్వడం సులభమైపోయింది. రాజకీయాల్లో హామీలు, వ్యాపారంలో ఒప్పందాలు, ఉద్యోగాల్లో వాగ్దానాలు, వ్యక్తిగత జీవితంలో ఇచ్చే మాటలు.. అనేక సందర్భాల్లో మాటకు ఉన్న విలువ తగ్గిపోతున్న భావన కనిపిస్తోంది. మాట ఇచ్చినప్పుడు ఒకలా, అవసరం తీరిన తర్వాత మరోలా వ్యవహరించడం వల్ల వ్యక్తుల మధ్య నమ్మకం దెబ్బతింటోంది.

కుటుంబ సంబంధాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. తల్లిదండ్రులకు పిల్లలు ఇచ్చే మాటలు, పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే హామీలు, భార్యాభర్తల మధ్య ఉండే నమ్మకం.. ఇవన్నీ మాట మీదే ఆధారపడి ఉంటాయి. ఒక ఇంట్లో మాటకు విలువ లేకపోతే అక్కడ ప్రేమ ఉన్నా ప్రశాంతత నిలవడం కష్టం. అందుకే కుటుంబాన్ని కాపాడేది కేవలం ఆస్తి కాదు.. ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం.

ధర్మం మనకు చెప్పే సత్యం కూడా ఇదే. మనిషి మాట్లాడే ముందు ఆ మాట వల్ల ఎదుటివారిపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలి. నిజం మాట్లాడాలి. అయితే నిజం పేరుతో ఎదుటివారిని బాధపెట్టడం కూడా ధర్మం కాదు. సత్యం, హితం, అవసరం---ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండాలి.

భారతీయ తత్వంలో వాక్కుకు ప్రత్యేక స్థానం ఉంది. మన మాట ఒకరికి ధైర్యం ఇవ్వగలదు. అదే మాట ఒకరిని జీవితాంతం బాధపెట్టగలదు. ఒక మంచి మాటతో విరిగిపోయిన మనసుకు ఊరట లభిస్తుంది. ఒక అవమానకరమైన మాటతో సంవత్సరాల బంధం తెగిపోవచ్చు. అందుకే మాటను కూడా ఒక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా సామాజిక మాధ్యమాల కాలంలో ఈ బాధ్యత మరింత పెరిగింది. గతంలో ఒక వ్యక్తి మాట్లాడిన మాట అతని చుట్టూ ఉన్న కొద్దిమందికే వినిపించేది. ఇప్పుడు ఒక పోస్టు, ఒక వ్యాఖ్య, ఒక వీడియో క్షణాల్లో వేలాది మందికి చేరుతుంది. ఆలోచించకుండా రాసిన ఒక్క మాట కూడా పెద్ద వివాదానికి దారితీయవచ్చు. అందుకే డిజిటల్ యుగంలో వాక్సంయమం మరింత అవసరం.

మాటను నిలబెట్టుకోవడం అంటే ప్రతి సందర్భంలో మనకు నష్టం వచ్చినా వెనక్కి తగ్గకపోవడం మాత్రమే కాదు. పరిస్థితులు మారినప్పుడు ఇచ్చిన మాటను అమలు చేయడం సాధ్యం కాకపోతే నిజాయితీగా ఎదుటివారికి వివరించడం కూడా బాధ్యతే. మోసం చేయడం, తప్పించుకోవడం, అబద్ధాలు చెప్పడం కన్నా నిజాన్ని అంగీకరించడం గొప్పది.

నేటి తరానికి మన పూర్వీకుల నుంచి అందించాల్సిన విలువల్లో మాట నిలబెట్టుకోవడం ఒకటి. పిల్లలకు పెద్ద పెద్ద నీతికథలు చెప్పడం కంటే, తల్లిదండ్రులు తమ మాటను తాము నిలబెట్టుకుంటే అదే వారికి గొప్ప పాఠం. ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తే అదే విద్యార్థులకు ఆదర్శం. ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తే అదే ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని పెంచుతుంది. మనిషి గొప్పతనం అతను ఎంత సంపాదించాడు అన్నదానిలో లేదు. అతను ఇచ్చిన మాటను ఎంతవరకు నిలబెట్టుకున్నాడన్నదానిలో ఉంది.

అందుకే ధర్మం అంటే కేవలం దేవుడిని పూజించడం కాదు. మన మాటకు విలువ ఇవ్వడం కూడా ధర్మమే. ఆలయంలో చేసే ప్రార్థన ఎంత పవిత్రమో, మనిషికి ఇచ్చే మాటను నిలబెట్టుకోవడం కూడా అంతే పవిత్రం.

మాట చిన్నదే కావచ్చు.. కానీ దాని వెనుక ఉన్న నమ్మకం చాలా పెద్దది.

మాటను కాపాడిన మనిషి తన గౌరవాన్ని కాపాడుకున్నట్టే.

**మాటకు విలువ ఉన్న సమాజంలోనే నమ్మకం బతుకుతుంది.. నమ్మకం ఉన్న చోటే ధర్మం నిలుస్తుంది.**



**విశ్లేషణ: దేగామ యోగేష్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్ I తెలంగాణ వెన్నెల వాక్కు**

# రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు

నిధులు

మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం పూర్తయితే దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఆయా ప్రాంతాల్లో తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని అందించే అవకాశం ఏర్పడుతుంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే అంశంపై అధ్యయనం చేయడానికి కన్సల్టెంట్ నియామకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మీడియాకు సమావేశ నిర్ణయాలను వెల్లడించారు.

## సుప్రీంకోర్టులో రాహుల్‌కు బిగ్ రిలీఫ్: వీర్ సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత, లక్నో కోర్టు సమన్లు రద్దు

రాహుల్‌గాంధీకి జారీ చేసిన సమన్లను కూడా అత్యున్నత న్యాయస్థానం రద్దు చేస్తూ సంచలన తీర్పును వెలువరించింది.

అసలు వివాదం నేపథ్యం

గత 2022వ సంవత్సరంలో మహారాష్ట్ర వేదికగా సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా నిర్వహించిన ఒక విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ వీర్ సావర్కర్‌పై కొన్ని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. వీర్ సావర్కర్ ఆనాడు బ్రిటిష్ పాలకులకు సేవకుడిగా ఉండే వారని, స్వాతంత్ర్య పోరాట కాలంలో విదేశీ పాలనా యంత్రాంగం నుంచి నెలవారీ పింఛను కూడా తీసుకున్నారంటూ సంచలన ప్రకటనలు చేశారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి, నిరసనలకు దారితీశాయి. రాహుల్ గాంధీ చేసిన ఈ కామెంట్లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక ప్రముఖ న్యాయవాది లక్నోలోని న్యాయస్థానాన్ని ఆశ్రయించి, ఆయనపై క్రిమినల్ పరువు నష్టం ఫిర్యాదును నమోదు చేశారు.

ఈ ఫిర్యాదును పరిశీలించిన లక్నో దిగువ కోర్టు, విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ రాహుల్‌గాంధీకి సమన్లు జారీ చేసింది. అయితే, లక్నో కోర్టు జారీ చేసిన ఆ సమన్లను మరియు తనపై నమోదైన క్రిమినల్ పరువు నష్టం కేసును సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ న్యాయవాదుల ద్వారా సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్‌ను దాఖలు చేశారు.

సుప్రీంకోర్టు కీలక విచారణ మరియు విశ్లేషణ

ఈ పిటిషన్‌పై ఈ రోజు సుప్రీంకోర్టు అత్యున్నత ధర్మాసనం విస్తృత విచారణ చేపట్టింది. విచారణ సమయంలో చట్టపరమైన నిబంధనలను లోతుగా పరిశీలించిన ధర్మాసనం, క్రిమినల్ పరువు నష్టం కేసును ముందస్తుగా విచారించడానికి సంబంధిత అధికారిక యంత్రాంగం నుంచి చట్టప్రకారం తీసుకోవాల్సిన పూర్వ అనుమతి ఉందో లేదో సరిచూసింది. ఈ క్రమంలో, ఈ కేసును దిగువ కోర్టు విచారించడానికి అవసరమైన ప్రభుత్వ ముందస్తు అనుమతి ఏదీ తీసుకోలేదని ధర్మాసనం స్పష్టంగా గుర్తించింది. చట్టబద్ధమైన అనుమతులు లేని పక్షంలో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లు చెల్లవని న్యాయస్థానం స్పష్టం చేసింది. సాంకేతికపరమైన మరియు నియమ నిబంధనల అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటూ, రాహుల్ గాంధీపై ఉన్న పరువు నష్టం కేసుతో పాటు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను పూర్తిగా కొట్టివేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

గత విచారణల్లో సుప్రీంకోర్టు హెచ్చరికలు

ఈ కేసు విచారణ ప్రక్రియలో భాగంగా, గతంలో జరిగిన విచారణల సమయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం రాహుల్ గాంధీకి కొన్ని కీలక సూచనలు, తీవ్ర హెచ్చరికలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా న్యాయకోవిదులు గుర్తుచేస్తున్నారు. దేశ చరిత్రలో ప్రముఖ పాత్ర పోషించిన మహోన్నత స్వాతంత్ర్య సమరయోధులపై మాట్లాడేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, తగిన ఆధారాలు లేకుండా బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రమూ సరికాదని సుప్రీంకోర్టు గతంలోనే హెచ్చరించిన సంగతి తెలిసిందే. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను వాడుకునే క్రమంలో ఇతరుల గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందనే విషయాన్ని స్పష్టం చేసింది.

ఏదేమైనప్పటికీ, తాజాగా లభించిన చట్టపరమైన మరియు సాంకేతిక అంశాల ప్రాతిపదికన రాహుల్‌గాంధీకి ఈ సుదీర్ఘమైన క్రిమినల్ పరువు నష్టం కేసు నుంచి అత్యున్నత స్థాయి ఉపశమనం లభించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ బిగ్ రిలీఫ్ తీర్పు పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని అనవసరమైన రాజకీయ విమర్శలతో చట్టపరమైన ఇబ్బందులకు గురిచేయాలనే కుట్రలకు ఈ తీర్పు చెక్ పెట్టిందని కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానించాయి.

## జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ బ్యూరో

భారతదేశ సామాజిక విప్లవ పితామహులు, గొప్ప సామాజిక సంస్కర్తలు, సమాజంలోని సకల జనులకు విద్యా వెలుగులు పంచిన ప్రదాతలు స్వర్గీయ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల మహోన్నత విగ్రహాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు శుక్రవారం అత్యంత వైభవంగా ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నెక్లెస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఈ మహనీయుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించి, పూలమాలలు వేసి భావోద్వేగంతో పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు విభిన్న ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సమాజంలో బహుజనులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, విద్య మరియు చైతన్యమే ఆయుధంగా పోరాడిన పూలే దంపతుల సేవలను ఈ సందర్భంగా పలువురు నేతలు కొనియాడారు. వారి ఆశయ సాధనకు తమ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతులు నాడు సమాజంలో అనేక రకాల ఆంక్షలు, తీవ్రమైన వ్యతిరేకతలు ఎదురైనప్పటికీ వెనుకంజ వేయకుండా బహుజనులకు, ముఖ్యంగా మహిళలకు చదువు చెప్పించి నూతన చరిత్రకు శ్రీకారం చుట్టారని సభలో వక్తలు గుర్తుచేశారు. దేశంలోనే తొలిసారిగా మహిళల కోసం పాఠశాలను ప్రారంభించి, స్త్రీ సాధికారతకు బలమైన పునాదులు వేసిన దంపతులుగా వారి పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని కొనియాడారు. అణచివేతకు

## ఆర్జీయూకేటీ బాసరలో 'హ్యాండ్‌బుక్ ఆఫ్ ఫ్యాకల్టీ' పుస్తకావిష్కరణ



బాసర, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) అధ్యాపకుల నైపుణ్యాలు, నైతిక విలువల సాధికారత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ ఫ్యాకల్టీ' మార్గదర్శక గ్రంథాన్ని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు.
ఏఐ ఆధారిత డిజిటల్ రూరల్ యూనివర్సిటీగా బాసర ట్రిపుల్ ఐటీని తీర్చిదిద్దేందుకు ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని విసి గోవర్ధన్ తెలిపారు. ఈ పుస్తకంలో బోధనా నాణ్యత, పరిశోధనలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బాధ్యతాయుత వినియోగం, విద్యార్థుల సంక్షేమంపై 21 సమగ్ర అధ్యాయాలను పొందుపరిచామన్నారు.
ప్రతి విద్యార్థీ ముఖ్యమే, ప్రతి తరగతీ ముఖ్యమే, ప్రతి ఉపాధ్యాయుడూ ప్రేరణగా నిలవాలనే ప్రధాన సూత్రం ఆధారంగా అధ్యాపకులు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఆయన సూచించారు. పరిశోధనా రంగంలో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.
ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్, అసోసియేట్ డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న డీటీసీ




.బాసర, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర క్షేత్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి బాలాలయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) రవీందర్ కుమార్ గౌడ్ శుక్రవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.
ఆలయానికి విచ్చేసిన డీటీసీ దంపతులకు జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమ్యరాణి, తిరుపతి, రజనీకాంత్ ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.
స్థానిక సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, కిష్ట గౌడ్ ఉప కమిషనర్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు వివరించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనీ దేవి, ఏఈఓ గంగా శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్లు, వేద పండితులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద బస్సులు ఆపాలి: ఏబీవీపీ వినతి



నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం సకాలంలో బస్సులు నడపాలని మరియు కళాశాల వద్ద బస్సులను నిలపాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఏబీవీపీ పాలిటెక్నిక్ కళాశాల అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ.. ఉదయం వేళల్లో బస్టాండ్ నుండి కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలేజీ ముగిసిన తర్వాత వచ్చే బస్సులు ఆగడం లేదన్నారు.
జగిత్యాల, ఖానాపూర్ మార్గాల నుండి వచ్చే బస్సులు పాలిటెక్నిక్ కళాశాల స్టేజీ వద్ద తప్పనిసరిగా ఆపేలా చర్యలు తీసుకోవాలని డిపో అధికారులను కోరారు. తద్వారా విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరుకోగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాల కార్యదర్శులు అలీషా, లితిక, విద్యార్థి ప్రతినిధులు అజయ్, కృష్ణ సాయి, మున్నా, అభి, రిశ్వంత్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణ ప్రభుత్వ ఉన్నత బడికి సౌండ్ సిస్టం అందజేసిన మార్కెట్ చైర్మన్



సారంగాపూర్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 25 వేల రూపాయల విలువైన స్పీకర్ బాక్సులతో కూడిన అంప్లిఫైయర్ సౌండ్ సిస్టమ్‌ను సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది శుక్రవారం బహూకరించారు.
పాఠశాల ప్రార్థనా సమావేశాలు, జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ సిస్టమ్ ఎంతో అవసరమని గుర్తించి తన సొంత నిధులతో కొనుగోలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నవీన జ్యోతికి అందజేశారు.
విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల అవసరాలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శ్రీనివాస్, అంజాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి రవి ఫౌండేషన్ నిత్యావసరాల సాయం



నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఆశన్న ఇటీవల ఆత్మహత్యకు పాల్పడి మరణించడంతో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి రవి ఫౌండేషన్ అండగా నిలిచింది. శుక్రవారం నిర్వహించే పెద్దకర్మకు అవసరమైన నిత్యావసర వస్తువులను ఫౌండేషన్ అందజేసింది.
నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న రవి ఫౌండేషన్ చైర్మన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజుల రవికుమార్ స్వయంగా ఆశన్న నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దకర్మకు కావలసిన బియ్యం, సరుకులను అందజేసి ధైర్యం చెప్పారు.
కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు సేవా కార్యక్రమాల స్ఫూర్తితో ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా నిరంతరం సాయం అందిస్తామని రవికుమార్ తెలిపారు.
సకాలంలో స్పందించి సాయం అందించిన రవి ఫౌండేషన్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ అజరుద్దీన్, బిక్కి దినేష్, లింగన్న, అఖిలేష్, అనిల్ పాల్గొన్నారు.

## భైంసాలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల డివిజన్ స్థాయి సమావేశం



.భైంసా/బాసర, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న భైంసా డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ల (రోజ్ గార్ సేవక్) డివిజన్ స్థాయి యూనియన్ విస్తృత సమావేశం శుక్రవారం భైంసా ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు.
సమావేశానికి అధ్యక్షత వహించిన భైంసా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సూర్యవంశి రాములు మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎన్టీఈ పే స్కేల్ అమలు చేయాలని, బదిలీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు వేతనాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.
సమావేశంలో బాసర, భైంసా, ముధోల్, లోకేశ్వరం, తానూర్, కుబీర్, కుంటాల మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలకు శిశుమందిరాలు నిలయాలు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలు మరియు దేశభక్తిని విద్యార్థులకు నేర్పించడంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు నిలయాలుగా నిలుస్తున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ బాగులవాడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలను ఆయన సందర్శించారు.
నూతన మౌలిక వసతులతో పునఃప్రారంభమైన పాఠశాల భవనాన్ని, తరగతి గదులను ఆయన పరిశీలించి పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు నైతిక విలువలు, భారతీయ ఆచారాలను బోధించడం ప్రశంసనీయమన్నారు.
విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, చిన్నయ్య, కౌన్సిలర్లు గంజి రాజు, కూన శశాంక్, జింక సూరి, విఠల్, నరేష్, అర్జున్, సాత్విక్, ఈశ్వర్, భూపతి రెడ్డి, అల్లం భాస్కర్, పాఠశాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాసర ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌గా పోగుల రాజేశ్వర్ ఎన్నిక



బాసర, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతుల సాగునీటి ప్రయోజనాలను కాపాడేందుకు ముధోల్ శాసనసభ్యుడు పవర్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో బాసర ఎత్తిపోతల పథక నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ కమిటీ చైర్మన్‌గా పోగుల రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ అస్గర్, వైస్ చైర్మన్‌గా నానం విజయ్, కోశాధికారిగా గుసుల రాజులు నియమితులయ్యారు.
ఎత్తిపోతల పథకం మరమ్మతులు, కాలువల ద్వారా నీటి పంపిణీని ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.
ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి సమానంగా సాగునీరు అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని నూతన చైర్మన్ రాజేశ్వర్ తెలిపారు. రైతుల సంక్షేమానికి కమిటీ కృషి చేస్తుందన్నారు.
ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మార్గదర్శకత్వంలో రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

## నిర్మల్‌లో రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు ఘన స్వాగతం

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాల సాధన, దేశ సమగ్రత లక్ష్యంగా సాగుతున్న రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సద్భావన జ్యోతికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని నాయకులు కొనియాడారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వాలను పెంపొందించడానికి రాజీవ్ గాంధీ చూపిన శాంతి మార్గం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. యువత సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని

# కాంగ్రెస్ పాలనలో అవినీతిపై అసెంబ్లీలో చర్చించాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## - మంత్రులపై వస్తున్న కుంభకోణాల ఆరోపణలపై తక్షణమే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి
## - తెలంగాణ విద్వేష ప్రసంగాల నిరోధక బిల్లు పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్ర

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదనే భయంతో ముఖ్యమంత్రి, మంత్రులు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ధోరణిలో దోపిడీకి పాల్పడుతున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం నిర్మల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనను పూర్తిగా గాలికొదిలేసి అవినీతి మాయంలో కూరుకుపోయిన మంత్రుల వ్యవహారాలపై రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు.

**క్యాబినెట్ భేటీలో అక్రమాలపై నిలదీయాలి:**
రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు కీలక శాఖల మంత్రులపై వస్తున్న వసూళ్లు, కమిషన్ల ఆరోపణలపై మిగతా మంత్రులు నిలదీయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. అలా చర్చించకుంటే ఈ సమావేశం కేవలం దోచుకున్న ప్రజాధనం పంపకాల కోసమేనని ప్రజలు భావిస్తారన్నారు. ఓటమి భయంతోనే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ మరియు జీహెచ్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తోందని ఆరోపించారు.

**సీఎం సోదరుడి కంపెనీకి భూ కేటాయింపులపై వివరణ ఇవ్వాలి:**
సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన టెసరాక్ట్ కంపెనీకి సుమారు 200 కోట్ల రూపాయల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేవలం 7 కోట్ల రూపాయలకే ఎలా కేటాయించారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్ బిల్లులకు 10 శాతం, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులకు 20 నుండి 30 శాతం వరకు కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలన్నారు.



**ఆధారాలతో ఏసీబీ, దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు:**
మంత్రులపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఆధారాలతో సహా కేంద్ర దర్యాప్తు సంస్థల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదులు చేస్తామని తెలిపారు. కమీషన్ల బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఏసీబీకి ఫిర్యాదు చేయాలని, బాధితులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఆంధ్ర కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నారని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తుండటం ప్రభుత్వ అవినీతికి నిదర్శనమన్నారు.

**ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు హేట్ స్పీచ్ బిల్లు:**
ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించడాన్ని ద్వేషపూరిత ప్రసంగంగా చిత్రీకరిస్తూ తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు-2026 ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. అత్యవసర పరిస్థితిని తలపించేలా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చట్టాలను బీజేపీ ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు.

**రైతు సమస్యలను గాలికొదిలేసిన పాలకులు:**
రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నిలిచిపోయిందని, ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టును ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో జరుగుతున్న కుంభకోణాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, చిన్నయ్య, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, అర్జున్, ఈశ్వర్, సాత్విక్ పాల్గొన్నారు.

# నిర్మల్ టౌన్‌లో రెండు చోరీ కేసుల ఛేదన: ఇద్దరు నిందితుల అరెస్ట్

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణ పరిధిలో ఇటీవల జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసులను నిర్మల్ టౌన్ పోలీసులు వేగవంతంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. డీఎస్పీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో టౌన్ సీఐ బి. సమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల పక్కన గల సాయి గణేష్ నర్సరీలో కూలీలు నిద్రిస్తున్న సమయంలో రెండు మొబైల్ ఫోన్లు చోరీ చేసిన కేసులో రౌడీషీటర్ మోసిన్ ఖాన్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుండి 15 వేల రూపాయల విలువైన ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తేలింది. అలాగే ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని నయీమ్ ఎలక్ట్రికల్ షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి 17 వేల రూపాయల విలువైన 15 కిలోల రాగి తీగను చోరీ చేసిన కేసులో పుట్ట స్వప్న అనే మహిళా నిందితురాలిని అరెస్టు చేశారు. చోరీ సొత్తును కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారి సయ్యద్ షంషీర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ప్రజలు తమ దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. కేసులను వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

# నిర్మల్‌లో రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు ఘన స్వాగతం

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాల సాధన, దేశ సమగ్రత లక్ష్యంగా సాగుతున్న రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సద్భావన జ్యోతికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని నాయకులు కొనియాడారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వాలను పెంపొందించడానికి రాజీవ్ గాంధీ చూపిన శాంతి మార్గం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. యువత సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

## - కడ్తాల్ సాగర్ కన్వెన్షన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశం
## - పోలీసు పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు, మౌలిక వసతులపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం జరగనున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

**పోలీస్ పరేడ్, వీఐపీ సీటింగ్ ఏర్పాట్లు:**
వేడుకలకు సంబంధించిన పోలీసు పరేడ్ మైదానం, ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు కూర్చునేందుకు కేటాయించిన వీఐపీ గ్యాలరీలు, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమం జరుగుతున్నంతసేపు నిరంతర విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, రక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పర్యవేక్షించాలన్నారు.

**కడ్తాల్ సాగర్ కన్వెన్షన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ:**
అనంతరం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్డుల పంపిణీకి హాజరయ్యే పేద లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు, సీటింగ్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.



**శాఖల మధ్య పూర్తి సమన్వయం అవసరం:**
స్వాతంత్ర్య వేడుకలు మరియు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీసు, పౌరసరఫరాల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు.

**లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి:**
స్మార్ట్ కార్డుల స్వీకరణకు వచ్చే వృద్ధులు, మహిళలకు ఎండ, వర్షం వల్ల ఇబ్బందులు లేకుండా టెంట్లు, షామియానాలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా స్మార్ట్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, అగ్నిమాపక అధికారి శివాజీ, డీఎస్పీ శ్రీనివాస్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# చేయూత పథకంలో బీడీ కార్మికులకు అవకాశం ఇవ్వాలి: టీయూసీఐ

హైదరాబాద్/నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద అందించే నూతన పింఛన్ల దరఖాస్తుల్లో బీడీ కార్మికులకు జీవన భృతి పొందే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్, సచివాలయంలో వినతిపత్రాలు అందజేశారు.




టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్, కే. రాజన్న ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 31 వరకు తీసుకునే దరఖాస్తుల్లో బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి బీడీ కార్మికురాలికి నెలకు 4,016 రూపాయల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో కార్మికులను విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీడీ కార్మికులకు దరఖాస్తు అవకాశం కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కే. సూర్యం, ఎస్.ఎల్. పద్మ, అరుణ్ కుమార్, బక్కన్న పాల్గొన్నారు.

# ముధోల్ నియోజకవర్గంలో రూ. 1.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## - ఎడ్బీడ్ తండా, ఎడ్బీడ్, కిష్టాపూర్ గ్రామాల్లో పంచాయతీ, మహిళా భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్
## - దశలవారీగా గ్రామీణ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడి

ముధోల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముధోల్ నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ తెలిపారు. శుక్రవారం ముధోల్, లోకేశ్వరం మండలాల పరిధిలోని ఎడ్బీడ్ తండా, ఎడ్బీడ్, కిష్టాపూర్ గ్రామాల్లో సుమారు కోటి యాభై లక్షల రూపాయల నిధులతో చేపట్టిన పలు నూతన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**ఎడ్బీడ్ తండాలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ:**
ముధోల్ మండలం ఎడ్బీడ్ తండాలో 32 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం మరియు మహిళా సమైక్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**ఎడ్బీడ్ లో గోదాం పనుల ప్రారంభం:**
అనంతరం ఎడ్బీడ్ గ్రామంలో 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న గోదాం నిర్మాణానికి భూమిపూజ చేసి, 10 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మహిళా సంఘాల బలోపేతానికి, సమావేశాల నిర్వహణకు ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

**కిష్టాపూర్ లో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం:**
లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనం, మరో 20 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముధోల్ మండలంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించామని, కనకాపూర్ ఎత్తిపోతల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు.



**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు:**
నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గ్రామాల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే పవార్‌కు గ్రామస్తులు, మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మల్ బెస్తవార్‌పేట్‌లో విజయవంతంగా 72 కోతుల పట్టివేత

నిర్మల్, ఆగస్టు 14 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని 25వ వార్డు బెస్తవార్‌పేట్ కాలనీలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పర్యవేక్షణలో మొత్తం 72 కోతులను పట్టుకున్నారు. పట్టుబడిన కోతులకు రంగులు వేసి, అటవీ శాఖ అనుమతులతో కవ్వాల్ దట్టమైన అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. కాలనీవాసులను భయాందోళనలకు గురిచేస్తున్న కోతుల బెడద నుండి విముక్తి కల్పించేందుకు ప్రత్యేక బృందాలతో ఈ ఆపరేషన్ చేపట్టారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో కోతుల సమస్యను పూర్తిగా అరికట్టేందుకు మున్సిపాలిటీ నిరంతరం ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తుందని వైస్ చైర్మన్ తెలిపారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లక్కాకుల హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ ప్రముఖులు మరియు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com